# ఏడో ఎక్కం

ఎ.విశ్వేశ్వరరావు



"ఊః! లే!" గర్జించాడు సుందరం పంతులు. "వెధవా! ఏడోఎక్కం రాకపోతే ఎందుకురా మూడో క్లాసులో? చాపు చెయ్యి వెధవా!" భయం భయంగా తన లేత అరచేతిని ముందుకు చూపాడు ఎనిమిదేళ్ళ బాబి. ఛెళ్ మంది బెత్తం. పిల్లలంతా బిత్తరపోతున్నారు. ఎప్పుడూ నవ్విస్తూ పాఠం చెప్పే మాస్టారు ఇవాళ ఇంత కోపంగా వున్నారేమిటా అని. గుడ్ల నీరు కుక్కుకుంటూ అలాగే నిలబడ్డాడు బాబి.

"ఫో! బెంచీ మీద నిలబడు" అరిచాడు సుందరం క్లాసంతా నిశ్శబ్దంగా వుంది.

"ఒరేయ్ సూర్యం! నీవు చెప్పరా ఏడవ ఎక్కం."

"ఏడొకట్లేడు, ఏడ్రెండ్లు పద్నాలుగు" గడగడ మొదలెట్టాడు సూర్యం.

మాస్టారి మనస్సు అక్కడలేదు. సుందరం తను చేసిన పనినే ఆలోచిస్తున్నాడు. ఏడవ ఎక్కం రాకపోతే మటుకు కొట్టాలాచిన్న వెధవని? చదవమనచ్చుగా? బాబి వంక తేరిపార చూచాడు సుందరం. కందగడ్డలా వుంది వాడి మొహం. గుడ్ల నీరుకుక్కుకుంటున్నాడు. హఠాత్తుగా గుర్తుకొచ్చింది సుందరానికి. ఆయన కాళ్ళు, చేతులు వణకసాగాయి. అతను..అతను..బాబి.. ఆ వూరి ప్రెసిడెంటుగారి అబ్బాయి. తనకి ఆశ్రయమిచ్చి, ఆదరించిన ప్రెసిడెంటు ముద్దులకొడుకు... గారాల కూచి.

మాస్టరు పరధ్యానం చూసి, రణగొణ ధ్వని మొదలుపెట్టారు పిల్లలు. కొంతమంది మాత్రం మాస్టారి వంక ఆలోచనగా చూస్తున్నారు.

"తన కెందుకివాళ అంత కోపం వచ్చింది?" ఆలోచించాడు సుందరం. చిరాకు కాక మరేమిటీ? ఇంటి నిండా బంధువులు, చేతిలో చిల్లిగవ్వలేదు. అప్పు కూడా పుట్టలేదు. ఏదో పొందికగా సంసారం నెట్టుకొస్తున్న తన ఇంటికి పెళ్ళివారు వచ్చారు. పక్కవూళ్ళో పెళ్ళిట. వెళ్ళేటప్పుడు పలకరిద్దామని. రెండురోజులు వుంటారుట. మళ్ళా వచ్చేటప్పుడు తప్పకుండా దిగుతామని మాట కూడా ఇచ్చారు. వూరంతా తిరిగాడు ఎక్కిన గుమ్మం ఎక్కకుండా. ప్రతివాడు మొండి చెయ్యి చూపించేవాడే. ప్రతివాడూ కుంటి సాకులు చెప్పేవాడే! అందరి కాళ్ళూ పట్టుకున్నాడు. చివరికి రామ్మూర్తిగారు దయతలచి, పదిహేను రూపాయలు ఇచ్చాడు. సరే! అవి వాళ్ళకి సరిపోతాయి ఆ రోజుకి. మళ్ళా రోజు ఏం చెయ్యాలిరా భగవంతుడా! అని తల బాదుకుంటున్నాడు. ఎలాగో అలాగ ఇంట్లోంచి బయటపడి స్కూలు చేరుకున్నాడు.

స్కూలుకి రాంగానే, కళకళలాడే పిల్లల మొహాలు చూడంగానే, కష్టాలన్నీ మర్చిపోయేవాడు ప్రతిరోజూ. ఇవాళ అలాకాదు. వాళ్ళ అల్లరి చూసి ఎందుకో చిరాకు అనిపించింది. రెండుమూడుసార్లు వాళ్ళ మీద కేకలు వేశాడు కూడా. పాఠం చెబుతూ అటు తిరిగేసరికి బాబిగాడు సూర్యం చెవిలో ఏదో చెబుతున్నాడు. ఆ అప్రాచ్యపు వెధవ చిరునవ్వులు చిందిస్తున్నాడు. తనకి ఒళ్ళుమండిపోయింది. అందుకనే ఏడోఎక్కం చెప్పమన్నాడు. తనకి బాగా తెలుసు. బాబిగాడు క్లాసులో మంచి తెలివిగలవాడనీ, వాడిని ఏడోఎక్కం ఒక్కటే భూతంలా పట్టేస్తుందనీ. అందుకనే అది అడిగాడు. వాడు నెమ్మదిగా చెబుతుంటే, తనే కేకవేశాడు. వాడు పూర్తిగా కంగారుపడిపోయాడు. ఫలితమే వాడికి దెబ్బలు. నిట్టూర్చాడు సుందరం.

తలెత్తి చూశాడు. పిల్లలంతా ఏదో వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. "ఒరేయ్! గ్రౌండులోకి వెళ్ళి ఆడుకోండిరా! నాలుగున్నర లోపల బయటికి వెళ్ళారో జాగ్రత్త!" హెచ్చరించాడు సుందరం. బిలబిలమంటూ పరిగెత్తారు పిల్లలు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్న బాబిని చూస్తే జాలివేసింది సుందరానికి.

ఆలోచనల్లోకి జారిపోయాడు సుందరం. బాబి ప్రెసిడెంటుగారి ఏకైక పుత్రుడు. వాడి కోసం, ఆయన ఏమైనా చేస్తారని ప్రతీతి. వాడిని కొడితే ఆయన సహించగలడా? ఆయనకి బాబి పుట్టక ముందు విపరీతంగా పొగ త్రాగడం అలవాటు వుండేదిట. కాని బాబి పుట్టాక ఒకటి జరిగిందిట. ఆయన చుట్ట కాలుస్తూ, వాడిని దగ్గరికి తీసుకున్నాడుట. ఆ పొగ పీల్చి బాబి ఉక్కిరిబిక్కిరి అయ్యాడుట

# ఏడో ఎక్కం

అంతే ఆయన తిరిగి పొగ వాసన చూడలేదు. అటు వంటి ముద్దుల కొడుకు చెయ్యి కందేటట్లుగా కొడితే, ఆయన సహిస్తాడా? ఈ సుందరం వున్నంత కాలం, తాను ఆ బడి కెళ్ళనని వాడు మొండికేస్తే, తనకి రెండో రోజున ఉద్వాసన పలకడూ? "ఇది టయ్యా నీవు చేసేది? ఉద్యోగం లేక అల్లాడుతుంటే ఆశ్రయమిస్తే నీవు చేసేది?" అని నిలదెట్టి అడ గడూ? ఇక్కడికి రాకపూర్వం తాను అకౌంట్సు ఆఫీసులో పని చేసేవాడు పట్నంలో. ఏదో ఉన్నంతలో బాగానే జరిగిపోయేది. ఉన్నట్లుండి, ఇరవయి మందిని రిట్రెంచ్ చేశారు. వాళ్ళతోపాటూ తానూ అయి పోయాడు. అంతే! జీవించడానికి వున్న ఒక్క ఆసరా కూలిపోయింది. ఎవరో చెబితే విని, ఈ వూరి నాయుడుగారు, ప్రెసిడెంటు దగ్గరికి వచ్చాడు. ఆయన జాలిదలచి ఉద్యోగం ఇచ్చి, రెండువందలు అప్పు ఇచ్చి, కూలిపోతున్న తన సంసారాన్ని తిరిగి నిలబెట్టాడు.

హఠాత్తుగా చేతివాచీ కేసి చూసుకున్నాడు సుందరం ఆలోచనల్లోంచి తెప్పరిల్లి. "నాలుగూ ఇరవై అయిదు."

"ఒరేయ్! పొండిరా ఇళ్ళకి! రేపు పెందరాళే రండి"

తనకే తెలియదు రేపు తను వస్తాడో రాడో?

"అయినా ఒక్క చిన్నదెబ్బ వేసినంతమాత్రానా, ఏం జరుగుతుందిలే! దానికి లేనివన్నీ వూహించుకుంటు న్నాడు. నిజంగా అంత సీరియస్‌గా ఏమీకాదు. ఆయన తనని మందలించవచ్చు. అయినా మాస్టరు అన్నాక, దెబ్బ వేయకుండా వుంటాడా" ఈ ఆలోచన సుంద రాన్ని తృప్తిపరుస్తోంది కాని, ఎందుకో అతని మనసు కీడుని శంకిస్తోంది. నెమ్మదిగా ఇల్లు చేరాడు సుంద రం.

గుమ్మంలో నిల్చున్న శారద భర్తని చూడగానే చిరునవ్వు వలకపోసింది. ఇంకో సమయంలో అయితే, తానూ నవ్వేవాడే! కాని ఇప్పుడు?

ముభావంగా ఉన్న భర్తని ఏమీ ప్రశ్నించలేదు శారద. ఏమైనా వుంటే అతనే, ఆమెకి చెప్పటం అలవాటు.

దొడ్లో స్నానం చేస్తూ ఆలోచిస్తున్నాడు సుంద రం. తన వుద్యోగం పోతే ఏం కావాలి? మళ్ళా వుద్యోగం ఎక్కడ దొరుకుతుంది?" స్నానం అయిపోయిందనీ, ఒళ్ళు తుడుచుకోవాలనీ, శారద గుర్తు చేస్తేకాని గుర్తే రాలేదు సుందరానికి.

బట్టలు వేసుకొని ఏటి ఒడ్డుకి బయలుదేరాడు సుందరం. అతని ఆలోచనలు అతనిని విడవటల్లేదు. అమాయకమైన బాబి మొహం అతనికి కళ్ళ ముందు కన్పిస్తోంది. రుద్రమైన నాయుడుగారి కళ్ళు తన వైపే చూస్తున్నాయి.

ఆలోచనల్ని కట్టిపెట్టి భారంగా ఇంటి ముఖం పట్టాడు సుందరం. దూరాన్నుంచే చూశాడు సుంద రం శారదని. శారద గుమ్మలో నిలబడి వుంది. ఏదో వార్త అతనికి చెప్పాలని ఆమె అనుకుంటున్నట్లు, ఆమె ముహం చూస్తేనే తెలిసిపోతోంది. దగ్గరగా వచ్చాడు సుందరం. "ఏమండీ! నాయుడుగారి పాలేరు వచ్చాడు. మిమ్మల్ని ఉన్నపళంగా రమ్మనమన్నారుట నాయుడుగారు." చెప్పి భర్త మొహంలోకి చూసింది శారద. అతను వణుకుతున్నాడు. మొహం పాలి పోయింది. పెదవులు కంపిస్తున్నాయి.

"ఏమిటండీ? అట్లా వున్నారు?" శారద ప్రశ్నిం చింది భర్తని భయంగా.

"ఏమీ లేదులే! ఆ! ఇదిగో ఇప్పుడే వెళ్తున్నా" బయలుదేరాడు సుందరం.

సుందరం మనసు పరిపరి విధాలపోతోంది. కాళ్ళు తడబడుతున్నాయి. ఆయనకి దేముడు పదేపదే గుర్తు కొస్తున్నాడు. దూరంగా నాయుడు గారిల్లు కనిపి స్తోంది. తలుపు దగ్గరికి వెళ్ళాడు సుందరం. వరం డాలో బాబి, కుక్కతో ఆడుకుంటున్నాడు. గేటు దగ్గర మనిషిని చూడగానే "భౌ" అంది కుక్క.

"ఏయ్ విక్కీ! పద లోపలికి" లోపలికి పరి గెత్తాడు బాబి.

గేటు తెరిచి లోపలికి వెళ్ళాడు సుందరం. నిశ్శ బ్దంగా వుంది. రెండు నిమిషాలయింది. ఎవరూ రాలేదు. ఆ నిశ్శబ్దం అతనికి భరింప శక్యం గాకుండా వుంది. ఇంతలో కర్టెను వెనకాల గాజులు చప్పుడు వినిపించింది. సుందరం తలత్రిప్పాడు.

"ఆ కుర్చీ మీద కూర్చోండి. అదుగో! ఆయన స్నానం చేస్తున్నారు. వస్తున్నారు."

కుర్చీలో కూలబడ్డాడు సుందరం.

"బాబి అంతా చెప్పాడులెండి. అదుగో! ఆయన వస్తున్నారుగా! అన్నీ తేల్చుకోవచ్చును."

ఆవిడ మాటలో వ్యంగ్యార్థం స్ఫురించింది సుంద రానికి. నెత్తి మీద సమ్మెటలతో కొట్టినట్లయింది సుందరానికి. కళ్ళు భైర్లు కమ్మసాగాయి. గుమ్మంలో నాయుడు భీకరంగా కనిపించాడు. అంతే! సుందరం కళ్ళు మసకలు కమ్మాయి.

కళ్ళు తెరిచి చూసేటప్పటికి, ఏదో క్రొత్త లోకంలోకి అడుగు పెట్టినట్లయింది సుందరానికి. వళ్లంతా బాధగా వుంది. నరాలు జివ్వుమంటున్నాయి. ఏదో హఠాత్తుగా గుర్తుకొచ్చి, అతని మెదడు నిద్ర నుండి లేచింది. "అమ్మా! మేష్టారు కళ్ళు తెరిచారు." మృదువైన, పరిచితమైన కంఠం వినిపించింది. ఆ కంఠంలో ఎంతో సంతోషం కనపడింది. అతను తల తిప్పి చూడకపోయినా, గుర్తు పట్టాడు అత డెవడో. వాడే.. బాబిగాడు.. "ఇదిగో! వస్తున్నారా!" నాయుడి భార్య కంఠం వినిపించింది సుందరానికి.

ప్రక్కగదిలో నుండి నాయుడు బొంగురు గొంతు వినబడుతోంది ఖంగుమని.

"బాబి చాలా రోజుల్నించి అడుగుతున్నాడు, 'మాస్టార్ని ఇంటికి పిల్చి నాకు ప్రైవేటు చెప్పమను నాన్నా! ఆయన ఎంత బాగా చెబుతారు" అని, అందుకని ఆయన్ని పిలిపించాను. నీరసంగా వున్నా, నా మాట కాదనలేక బయల్దేరి వెంటనే బయలుదేరి వచ్చాడు. కళ్ళు తిరిగాయి."

నాయుడుగారి భార్య "పళ్లరసం తీసుకోండి అన్నయ్యగారూ" అంది.

తృప్తిగా తాగి కళ్ళు మూసుకున్నాడు సుందరం.

నాయుడు గారింటి తలుపు తీయగానే, కుక్క తోకాడిస్తూ వచ్చింది. దాన్ని ముద్దాడి వరండాలోకి ఎక్కాడు సుందరం. బుద్ధిగా లెక్కలు చేసుకుంటు న్నాడు బాబి.

"మాస్టారూ! నాకు ఏడోఎక్కం బాగా వచ్చిం దండీ." వాడి మొహం వెలిగిపోతోంది.

తృప్తిగా వాడి తల నిమిరాడు సుందరం. అతని కళ్లల్లో నీళ్ళు నిండాయి. బాబి బిత్తరపోయాడు. ●

